**కథ**

**"చిన్నమ్మాయిని చూడటానికి వెళ్లి పెద్దమ్మాయిని చేసుకుంటానంటే బావుండదురా! కాదంటే నచ్చలేదని చెప్పేసి వేరే సంబంధం చూసుకుందాం" అంది వైదేహి కొడుకుతో.**



# స్నేహితుడు

**ఎస్.శ్రీదేవి**

''నీలిమని నువ్వు మర్చిపోయావా వామ్మా? స్కూల్లో నాకు బెస్టు ఫ్రెండు. మనింటికి కూడా నాలుగైదు సార్లు వచ్చింది'' తల్లి మాటల్ని పట్టించుకోకుండా అడిగాడు సూర్య.

సూర్య స్నేహితులంతా వైదేహికి గుర్తే. చామనఛాయలో బొద్దుగా ఉండి, అతనితో తమింటికి వచ్చిన నీలిమని ఆమె మర్చిపోలేదు. నీలిమ తల్లి చనిపోయినప్పుడు తనెళ్లి ఓదార్చింది కూడా. కానీ ఎలా? ముందురోజు పెళ్లిచూపులకి వెళ్లారు. అక్కడ పెళ్లికూతురి అక్కగా కనిపించింది నీలిమ. ఎమ్మెస్సీ చదివి ఇక్కడే కాలేజీలో లెక్చరర్‌గా చేస్తోందట. ఇంకా పెళ్లవలేదు. చేసుకోనందట. ఆమెనలా చూసినప్పట్నుంచీ సూర్య ఈ పాట పాడుతున్నాడు. అక్కడ వాళ్లిద్దరూ ఇవేం మాట్లాడుకోలేదు. అదొక్కటే అదృష్టం.

''మా పెద్దమ్మాయి నీలిమ. ఎమ్మెస్సీ పాసైంది. లెక్చరరు. ఇప్పుడే పెళ్లిచేసుకోనంటోంది. ఎంత చెప్పినా వినట్లేదు. తన కోసం ఆపడమెందుకని కావ్యకి చేసేస్తున్నాం'' అని పరిచయం చేశాడు రాజశేఖరం - పెళ్లికూతురి పినతండ్రి.

''గుర్తుపట్టావా?'' ఆప్యాయంగా అడిగాడు సూర్య. బదులుగా చిరునవ్వు నవ్వింది నీలిమ.

''మీకు మా నీలిమ తెలుసా?'' అడిగాడు రాజశేఖరం.

''ఇద్దరం టెన్త్ దాకా కలిసి చదువుకున్నాం'' జవాబిచ్చాడు సూర్య. ''ఏమ్మా, నీలిమా! బావున్నావా?'' అని వైదేహి కూడా పలకరించింది. అక్కడితో ఆ సంభాషణ ఆగిపోయింది. లేకపోతే అక్కడే అభాసయ్యేదనిపించింది వైదేహికి ఇప్పుడు.

''నీ క్లాస్‌మేటంటున్నావు, వరహీనమవుతుందేమో?'' మరో అభ్యంతరాన్ని కొట్టిపారేశాడు సూర్య.

''అసలు పెళ్లే చేసుకోనందట''

''అంటే అలా వదిలిపెట్టెయ్యటమేనా? ఎందుకు చేసుకోనందో తెలుసుకుని నచ్చచెప్పే బాధ్యత రాజశేఖరంగారికి లేదా?''

''అడిగారేమో! ఎవర్నైనా ప్రేమించి భంగపడిందేమో!''

''అలాంటిదేదీ ఉండదమ్మా! తనలో అలాంటి మెచ్యూరిటీ కనిపించలేదు. ఆ పదిహేనేళ్లప్పుడెలా ఉందో ఇప్పుడూ అలాగే ఉంది.''

''ఆ అమ్మాయి పెళ్లిచేసుకోవటం, చేసుకోకపోవటం... అవన్నీ వాళ్ల కుటుంబ వ్యవహారాలు. నీకిష్టమైతే నువ్వు చూసి నచ్చిన పిల్లని చేసుకో. లేకపోతే ఊరుకో. అంతేగానీ ఇలాంటి వేషాలేస్తే మర్యాదగా ఉండదు.'' అప్పటిదాకా మౌనశ్రోతలా వాళ్ల సంభాషణ వింటున్న మూర్తి కలగజేసుకుని కచ్చితంగా అన్నాడు.

''తను నా ఫ్రెండు నాన్నా! తనకి సహాయం కావాలి. ఆ విషయం నాకు స్పష్టంగా తెలుస్తుంది. ఏమీ చెయ్యకుండా ఎలా ఉంటాను? కొన్ని కొన్ని బావుండనివే కొందరికి ఉపకరిస్తాయి. నేను నీలిమనే చేసుకుంటాను. ఎవర్నీ నొప్పించకుండా... అందర్నీ ఒప్పించే చేసుకుంటాను'' అంతకంటే స్పష్టంగా చెప్పాడు.

ఎదిగిన కొడుక్కి అంతకంటే ఏం చెప్పగలరు? ఎలాంటి అపఖ్యాతి వస్తుందోననిపించినా భార్యాభర్తలిద్దరూ మౌనం వహించారు.

★ ★ ★

నేరుగా నీలిమ పనిచేస్తున్న కాలేజీకి వెళ్లాడు సూర్య. అప్పుడే క్లాసు పూర్తయి వెయిటింగ్ రూంలోకి వెళ్లబోతోంది. సూర్య ఎదురొచ్చాడు. అతన్ని చూసి తెల్లబోయింది.

''నిన్న మాట్లాడలేదేం? అందుకే ఈవేళ వచ్చాను'' అన్నాడు.

''బావుండదని'' పొడిగా జవాబిచ్చింది. చిన్నప్పటి స్నేహితుడు కనిపిస్తే మాట్లాడలేనంత అస్వతంత్రతలో ఆమె ఉందని అతనికి అర్థ

మైంది'' ''మాట్లాడాలని వచ్చాను. ఫ్రీయేనా?'' జేబులోంచీ సెల్ తీసి టైం చూసి, ''వంటిగంటవుతోంది. బైట లంచి చేద్దామా?'' అడిగాడు.

ఆమె తలూపింది. ఇద్దరూ బైటికి నడిచారు. హోటల్ సవేరాకి లీడ్ చేశాడతను. రావటమైతే వచ్చిందిగానీ నీలిమకి చాలా ఇబ్బందిగా ఉంది, చెల్లెలికి ప్రపోజ్ చేయబడ్డ వ్యక్తితో ఇలా రావటం... కానీ అతనంటే ఉన్న అభిమానం దాన్ని డామినేట్ చేసింది.

లంచి ఆర్డరిచ్చాక కొద్దిసేపు ఏవో విషయాలు మాట్లాడుకున్నారు.

''మీ మదర్ చనిపోయాక మీరా ఊర్నించీ వెళ్లిపోయారు. సెలవులు కదా, నేనప్పుడు మా తాతగారి ఊరు వెళ్లాను. తిరిగొచ్చేసరికి మీరు లేరు. అలా జరుగుతుందని కొంచెం కూడా ఊహించలేదు. చాలా రోజుల పాటు నువ్వు గుర్తొచ్చి దిగులేసేది. మళ్లీ కలుసుకుంటామనుకోలేదు'' అన్నాడు.


తల్లి ప్రస్తావన రావటంతో నీలిమ ముఖం విషాదంగా మారింది. ఆమెకి పదిహేనేళ్లప్పుడు జరిగిందా సంఘటన. పెళ్లికి వెళ్తుంటే కారుకి ఏక్సిడెంటైంది. నీలిమ తల్లీ, చెల్లీ అక్కడికక్కడే చనిపోయారు. నీలిమా, తండ్రీ మిగిలారు. చాలా పెద్ద ట్రాజడీ అది. నీలిమ చదివే స్కూలు పిల్లలూ, టీచర్లూ అందరూ వచ్చి ఓదార్చి వెళ్లారు. సూర్య వైదేహిని తీసుకొచ్చాడు. ఆమె దగ్గరకి తీసుకుని ఎన్నో విధాల ధైర్యం చెప్పింది నీలిమకి.

నెల రోజులు అసలు స్కూలుకే వెళ్లలేదు నీలిమ. దిగులు, బెంగ ఆమెని తినేసేవి. చదువుతున్నది టెన్త్‌క్లాసు. పబ్లిక్ ఎగ్జామ్. నోట్సులన్నీ రాసిపెట్టే వాడు సూర్య. వెంటబెట్టుకుని స్కూలుకి తీసుకెళ్లేవాడు. ఏడుస్తుంటే ఓదార్చేవాడు. టిఫిన్ బాక్సులో అన్నం తీసుకొచ్చి బలవంతంగా తినిపించేవాడు. ఆమెకి మళ్లీ ఊపిరిపోసింది అతని స్నేహమే. ఎలాంటి ఆకాంక్షలూ కోరికలూ ఎరగని స్నేహం. అదే సంవత్సరం నీలిమ తండ్రి ఆ ఊర్నించీ ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వెళ్లిపోయాడు. అవన్నీ లిప్తలో గుర్తొచ్చాయి నీలిమకి. ఆ తర్వాత జరిగినవి కూడా.

వేరే ఊరెళ్లాక నీలిమ తండ్రి రాజశేఖరం మళ్లీ పెళ్లిచేసుకున్నాడు. సరళ ఆమె పేరు. అప్పటిదాకా నీలిమకి ఆయనతో ఉన్న అనుబంధమేదో పల్చబడ్డట్టైంది. అప్పటిదాకా లేని దూరం, సంకోచం మొదలయ్యాయి ఆయన దగ్గర. కావ్య రాక ఆ దూరాన్ని మరింత పెంచింది. కావ్య సరళ అక్క కూతురు. తనకి పిల్లలు పుట్టరని తెచ్చి దగ్గరుంచుకుంది. నీలిమకన్నా రెండేళ్లు చిన్నది. ఆమెనే ముందు రోజు సూర్య వెళ్లి చూసింది.

''పెళ్లెందుకు చేసుకోలేదు నీలిమా, నువ్వు?'' ఉన్నట్టుండి అడిగాడు సూర్య. ''మన ఫ్రెండ్సందరికీ పెళ్లిళ్లయ్యాయి. నువ్వూ నేనూ మిగిలాం. నీకు చెయ్యకుండా కావ్యకి చెయ్యటమేమిటి? అసలెవరీ కావ్య? మీ చెల్లి అప్పుడే పోయిందిగా?'' మామూలుగా ఉన్నట్టుండటానికి ప్రయత్నించాడు.

అతని కన్సర్న్... తన గురించి పట్టించుకునే వాళ్లున్నారన్న ఆలోచన... ఆమె మనసును కుదిపాయి. ''కుటుంబంలోని ఇద్దరు వ్యక్తులు చనిపోయాక మిగిలిన ఇద్దర్నే కుటుంబం అనుకోలేక మళ్లీ పెళ్లి చేసుకున్నాడు మా నాన్న. ఇంట్లో



## ప్చ్! బిపాషా

**ఈమధ్య న్యూజెర్సీలో ఒక స్టేజ్ షో కోసం బిపాషా బసు వెళ్లింది. సాధారణంగా సినిమా తారలు పబ్లిక్ ఫంక్షన్లకి వెళ్లినప్పుడు తుంటరి మూకలు చుట్టుముట్టి నానా బీభత్సం చేయడం, వాళ్లనెలాగైనా పట్టుకుందామని ప్రయత్నిండం జరుగుతుంటుంది. న్యూజెర్సీ షో కోసం ఆమెని తీసుకెళ్లేందుకు కారుని ఎరేంజ్ చేశారు నిర్వాహకులు. ఆ కారు డ్రైవరు అతని అసిస్టెంట్ బిపాషా గురించి చాలా అసభ్యంగా, అసహ్యంగా మాట్లాడుకోవడం విన్న బిపాషా- చాలా బాధపడుతూ స్టేజ్ మీద ఈ సంగతి చెప్పేసి బాగా నిర్వాహకుల్ని దులిపేసిందిట. ఈ సంగతి బిపాషాయే స్వయంగా సెలవిస్తూ మరీ సభ్యత మర్చిపోతున్నారు జనాలు అంటూ వాపోయింది.**

కేంద్రబిందువు పిన్నయింది. సహజమే. నాకూ ఆవిడకీ చనువు ఏర్పడలేదు. అది కూడా సహజమేననుకుంటా. కావ్య పిన్ని అక్క కూతురు. పిన్ని చుట్టే తిరిగేది. నాన్న ఆఫీసు నించీ రాగానే పిన్ని ఎదురెళ్లేది. పిన్ని వెంటే కావ్య కూడా వెళ్లేది. 'అమ్మ ఉన్న రోజుల్లో నేను ఎదురెళ్లినట్టే. ఆయన చేతిలోవి అందుకునేది. తనకి నచ్చినవి తీసుకుని మిగతావి వదిలిపెట్టేది. ఆ మధ్యలోకి ఎలా చొరబడాలో అర్థం కాక అలాగే ఉండిపోయాను. నాన్న నాకు ఇంకా ఇంకా దూరం జరిగారు'' అంది తన మనసు తెరుస్తూ.

సూర్యకి బాధనిపించింది. ఆమె మౌనంగా ఇన్నాళ్లు అనుభవించిన బాధని అతను ఇప్పుడనుభవించాడు. బాంధవ్యాలు పరాయీకరణ కావటంలోని విషాదం అర్థమైంది.

''మరి పెళ్లెందుకు వద్దన్నావు? చేసుకుంటే నీ ఇల్లు నీకు ఏర్పడేది కదా? హేపీగా ఉండేదానివి?'' ఆర్తిగా అడిగాడు. ఇబ్బందిగా చూసి తలదిం

చుకుంది. ఇంట్లో ఎన్నో వ్యవహారాలు.. అవన్నీ ఇతనికి చెప్పాలా? మనసు లోలోపలికి ముడుచుకుపోతున్న భావన. తల్లి పోయిన కొత్త రోజులూ, అతని అభిమానం గుర్తొచ్చాయి. అతని దగ్గర దాపరికమేమిటి?'' అని వెంటనే అనిపించింది.

''పిన్ని క్రెడిట్ కార్డులు ఇష్టం వచ్చినట్టు వాడేస్తుంది. అందులోంచీ వచ్చే డబ్బునీ దాంతో కొనగలిగే వస్తువులనీ గురించి తప్ప పెరిగిపోతున్న అప్పు గురించీ నెలనెలకీ పెరిగిపోతున్న ఇన్‌స్టాల్‌మెంట్స్ గురించీ ఆలోచించదు. నాన్న చెప్పబోతే కోపం. నాన్నది రెండో పెళ్ళనీ, ఆయనకింక పిల్లలు పుట్టరనీ తెలిసే చేసుకుంది. పెళ్ళప్పటికి ఆవిడ వయసూ తక్కువ కాదు. కానీ ఆ రెండు విషయాలతో ఆయన్ని గుచ్చిగుచ్చి బాధ పెడుతుంది ... '' నీలిమ గొంతులో తీవ్రమైన బాధ.

''.....''

''క్రెడిట్ కార్డుల మీద అప్పు రెండు లక్షల పైనే ఉంటుంది. నా జీతం ఇంట్లోనే ఇస్తాను. ఇద్దరి జీతాలూ కలిపినా చాలదు. అవికాక పర్సనల్ లోన్స్. ఇంకా చాలక బైట కూడా అప్పులు చేస్తున్నారు నాన్న. ఈ వత్తిడి తట్టుకోలేక బాగా స్మోక్ చేస్తున్నారు. నాకేమిటో భయంగా ఉంటుంది. ఆయన ఏ క్షణానేనా సూసైడ్ చేసుకుంటారేమోననిపిస్తుంది. ఆ టెండెన్సీ అలా అనిపిస్తుంది. ఇల్లమ్మేసి కావ్య పెళ్లి చేస్తానంటున్నారు.''

''మరి నీ విషయం?''

''ఈ పరిస్థితుల్లో నేను పెళ్లెలా చేసుకోను?''

తదేకంగా చూశాడు సూర్య ఆమెని. ఎంత అమాయకత్వం? తనింట్లోనే తనకి జరుగుతున్న అన్యాయాన్ని సైతం గుర్తించలేనంత అమాయకత్వం.. దానికి తోడు తండ్రి పట్ల పొసెసివ్‌నెస్ కూడా... ఎలాంటి తండ్రి అతను! కన్నకూతుర్ని ఆక్టోపస్‌లా పీల్చేస్తూ పెంపుడు కూతురి కోసం త్యాగాలు చేస్తున్నాడు! నిరసనగా అనుకున్నాడు.

''మనిద్దరం పెళ్లి చేసుకుందామా?'' మెల్లిగా అడిగాడు. నీలిమ ముఖం కోపంతో ఎర్రబడింది.

''ఏం మాట్లాడుతున్నావు నువ్వు? కావ్యని చూసుకోవటానికి వచ్చి ఇదేంటి? వద్దు. తను హర్టౌతుంది. అసహ్యంగా ఉంటుంది'' అంది.

''నేను మేనేజి చేస్తానుగా?''

''వద్దు సూర్యా! మన స్నేహం స్నేహంలా ఇలాగే ఉండిపోనీ. నాన్నా, పిన్నీ ఇద్దరూ బాధపడతారు''

''సరే. ఎంతకాలం ఇలా ఉంటావు? ఎప్పటికి తీరతాయి నీ సమస్యలు?''

నీలిమ తలదించుకుంది.

''నీలిమా! మనం సింపుల్‌గా రిజిస్టరు మేరేజి చేసుకుందాం. ఇద్దరం కలిసి ఐతే మీ నాన్న సమస్యలు తీర్చగలం.''

''అదేదో కావ్యని చేసుకుని కూడా చెయ్యొచ్చు'' పదునుగా ఉంది నీలిమ గొంతు.

''నువ్వు తప్ప వాళ్లెవరూ నాకేమీ కారు'' స్థిరంగా ఉంది సూర్య జవాబు.

చాలాసేపటి దాకా నీలిమ ఏమీ మాట్లాడలేదు. ప్లేట్‌లో ఉన్న పదార్థాలని కెలుకుతూ ఉండిపోయింది. తనకి పెళ్లి పట్ల విముఖతేమీ లేదు. సూర్య అంటే అయిష్టం కూడా లేదు. సూర్యని చేసుకుంటే తండ్రి సమస్యల్లోంచీ బైట పడతాడా? ఎలా? ఎవరో ఒకరి సపోర్టు కావాలనిపిస్తోంది తనకి. తండ్రికి కూడా అలాగే అనిపిస్తుందేమో! ఒక సమస్యని అందులోనే ఉంటూ విశ్లేషించడం వేరు. దానితో సంబంధం లేని వ్యక్తి విశ్లేషించటం వేరు. ఈ రెండు దృక్పథాలూ కలిసేచోట ఆ సమస్యకి పరిష్కారం ఉంటుందేమో! జవాబివ్వలేకపోయింది.

''నేను మీ నాన్నగారితో మాట్లాడతాను'' అన్నాడు సూర్య తనే నిర్ణయం తీసుకుని.

★ ★ ★

''సర్! మీతో పర్సనల్‌గా మాట్లాడాలి ఎక్కడైతే వీలవుతుందో చెప్పండి''

సూర్య ఫోన్ చేసి అడిగితే ఆశ్చర్యం కలిగింది రాజశేఖరానికి. ''ఇంటికి వచ్చెయ్యండి'' అన్నాడు మామూలుగా.

''ఎక్కడేనా బయట. పార్కుకి రాగలరా? గాంధీ బొమ్మ దగ్గర ఎదురుచూస్తుంటాను'' సూర్య సూచించాడు.

''అరగంటలో అక్కడుంటాను'' అతనికి జవాబిచ్చి బయల్దేరాడు. మనసు నిండా ఎన్నో సందేహాలు. అక్కడికి చేరేసరికి సూర్య ఎదురు చూస్తున్నాడు. ''రండి'' ముందుకి దారితీశాడు. ఇద్దరూ ఒక బెంచి మీద కూర్చున్నారు. రాజశేఖరానికి వింతగా ఉంది. ఇలా పార్కులో కూర్చుని విషయాలు చర్చించుకునే రోజులు ఇంకా మిగిలున్నాయా? ఎవర్ని పలకరించినా అశోకాలో వెయిట్ చేస్తాను. రత్నాలో లంచి తీసుకుంటూ మాట్లాడుకుందాం అనేవాళ్లే, ఆ మసకచీకటి వాతావరణంలో మనసంతా ముసురుపట్టినట్టుంటుంది తప్ప ఆలోచనలు చురుగ్గా కదలవు. ఇక్కడేమిటో ప్రశాంతంగా ఉన్నట్టనిపించింది.

సూర్య ఇద్దరికీ రెండు కొబ్బరిబోండాలు తీసుకొచ్చాడు. తనొకటి తీసుకుని ఆయనకొకటి ఇస్తూ- ''మీరు నన్ను గుర్తుపట్టలేదు. నీలిమ కోసం మీ ఇంటికి చాలాసార్లు వచ్చాను. ముఖ్యంగా వాళ్లమ్మ పోయినప్పుడు'' అన్నాడు. రాజశేఖరానికి నిజంగానే గుర్తు రాలేదు. అవి చీకటి రోజులు. ఎవరు ఎవర్ని ఓదార్చారో... ఎలా ఆ దుఃఖంలోంచీ బైటపడ్డారో ఇప్పటికీ ఆశ్చర్యమే. కానీ ఆ దుఃఖపు కెరటాలు తననొక ఒడ్డుకీ నీలిమనింకొక ఒడ్డుకీ చేర్చినట్టు అప్పుడప్పుడనిపిస్తుంది. ఈమధ్య తామిద్దరి మధ్య దూరం మరీ పెరిగిపోయినట్టుగా ఉంది.

ఆయన ఆలోచనలు చదివినట్టు సూర్య చిన్నగా నవ్వాడు. అందులో స్వల్పంగా వ్యంగ్యం అర్థమైంది రాజశేఖరానికి. ఇబ్బందిగా కదిలాడు.

''నిన్న తనని కలిసి మాట్లాడాను. మీ ఇంటి పరిస్థితులు చెప్పింది. మా ఫ్రెండ్స్ సర్కిల్లో మొత్తం నలుగురు అమ్మాయిలు, ఇద్దరబ్బాయిలం. అందరం హేపీగా ఉన్నాం. నీలిమ ఒక్కర్తే ఇలా... మదర్ లేకపోవటం బాధే. కానీ...'' ఆగిపోయాడు సూర్య.

''తనకి మా ఇంట్లో ఏ లోటూ లేదు. అందరూ మంచిగానే చూసుకుంటారు. అసలు తనకి ప్రాబ్లమ్స్ ఏవైనా ఉంటే నాతో చెప్తే నేను సాల్వ్ చేస్తాను కదా?''

''తన ప్రాబ్లమల్లా మీరే. చేసిన అప్పుల వత్తిడిలో ఏ క్షణాన పేపర్లో న్యూస్‌గా మారిపోతారానని భయపడుతోంది'' కూల్‌గా అన్నాడు సూర్య. రాజశేఖరం ముఖం పాలిపోయింది. నుదుట చెమటలు పట్టాయి. జేబులోంచీ కర్చీఫ్ తీసుకుని ముఖం తుడుచుకున్నాడు. సూర్య కేంటీన్‌కి వెళ్లి వాటర్ బాటిల్ కొనుక్కొచ్చి మూత తీసి ఇచ్చాడు. అందుకుని గటగట తాగేశాడు రాజశేఖరం.

''రిలాక్స్‌డ్‌గా నా మాటలు



వినండి. నీలిమని నేను పెళ్లి చేసుకుందామనుకుంటున్నాను. ఇప్పుడు మీరున్న పరిస్థితుల్లోనైతే తను ఒప్పుకోదు. అందుచేత కొంత ఓపెన్గా మాట్లాడాలనుకుంటున్నాను. మీ సమస్యలు నేను కొంతవరకూ పరిష్కరించగలను'' అన్నాడు సూర్య. ''నాకు కట్నం అక్కర్లేదు. ఇల్లమ్మేద్దామనుకుంటున్నారు కదా? అమ్మితే పధ్నాలుగు లక్షల దాకా వస్తుందని చెప్పింది నీలిమ. ముందు అప్పులన్నీ తీర్చెయ్యండి. మిగిలిన దాంట్లోంచీ రెండు లక్షలు సింగిల్ బెడ్రూం ఫ్లాట్కి అడ్వాన్సివ్వండి. మిగతాది లోన్ తీసుకోవచ్చు. ఎన్ని ఖర్చులున్నా సొంతిల్లనేది ఉండాలి. ఇంకా మిగిలింది సగం నీలిమకీ సగం కావ్యకీ ఇవ్వండి. నీలిమకి ఇవ్వకపోయినా నాకేం అభ్యంతరం లేదుగానీ, తను హర్టౌతుంది. కనీసం కావ్యతో సమానంగానేనా తనని చూడలేదని'' రాజశేఖరం నిరుత్తరుడై చూస్తూ ఉండిపోయాడు.

''ఇవన్నీ జరగకపోతే నీలిమ పెళ్లి చేసుకోదు. ఇప్పుడు తన సంపాదన వాడుకుంటూ ఏదో ఒకలా బండిని నెట్టుకెళ్లిపోతున్న మీరు, ఏదో ఒక రోజుని తనకి జవాబు చెప్పుకోవలసిన పరిస్థితి వస్తే మాత్రం చెప్పడానికి మీ దగ్గర ఏదీ ఉండదు. నేను వెళ్తాను. ఆలోచించుకుని చెప్పండి ఏ విషయం'' సూర్య వెళ్లిపోయాడు.

రాజశేఖరం అలాగే కూర్చుండిపోయాడు. పరిస్థితులు, వాటికి దారితీసిన తన నిస్సహాయత, వాటి చాటున నీలిమని ఎక్స్ప్లాయిట్ చేస్తున్న తన స్వార్థం.. కళ్లకి కట్టినట్టు కనపడుతున్నాయి. భార్య పెట్టే నిరర్థకమైన ఖర్చులు.. వృధా అవుతున్న నీలిమ జీతం.. నిజమే ఈ వత్తిడిని తట్టుకోలేకపోతున్నాడు తను! కృంగిపోతున్నాడు. చచ్చిపోవాలనే కోరిక తరచుగా కలుగుతోంది. ఎన్నోసార్లు బలంగా అనిపించిందలా. ఎవరూ గుర్తించనిది తన కూతురు గుర్తించింది. ఎంత ప్రేమ దానికి? తనేం చేశాడని? దానివైపు నించీ సూర్య ఎంత చక్కగా రిప్రజెంట్ చేశాడు!

నిజమే! అతను చెప్పినట్టు చేస్తే అప్పుల్లోంచీ విముక్తి తనకి. మిగిలిన డబ్బులోంచీ సగం తీసి సరళ చేతిలో పెట్టి ఏదైనా చేసుకోవాలి. పది పన్నెండు లక్షలు ఖర్చు పెట్టి ఘనంగా కావ్యకి పెళ్లిచేయాలన్నది సరళ కోరిక. అది అవసరం కాదు, కేవలం కోరికే. అందుకు భిన్నంగా జరిగితే గొడవ చేస్తుందేమో! రెండో పెళ్లివాడికిచ్చి తన గొంతు కోశారనీ ఏ సరదా తీరలేదని ఏడుస్తుంది. ఏడవనీ.. ఇప్పుడొకలాంటి వత్తిడి, అప్పుడింకొకలా. కానీ జీవితాలు నిలబడతాయి. నీలిమ కన్నా కావ్య ఎక్కువ కాదు తనకి. ఇప్పటికే నీలిమ జీతం లెక్కలేకుండా వాడుకున్నాడు తను. ఎంతో అన్యాయం జరిగింది. తను చేసిన తప్పు సరిదిద్దుకోవటానికి వచ్చిన అవకాశం సూర్య.

గుండెల నిండా శ్వాస తీసుకుని లేచి నిలబడ్డాడు. ఏదో కొత్త శక్తి వచ్చినట్టనిపించింది. తను చర్చిస్తే ఇవన్నీ నీలిమ తనతోటే మాట్లాడేదేమో నేరుగా! తామిద్దరి మధ్యనీ అడ్డుగోడలు ఏర్పడిపోయాయి. సూర్య వలన మళ్లీ కమ్యూనికేషన్ ఏర్పడింది.

★ ★ ★

''ఏమిటి, మూడు లక్షలతో కావ్య పెళ్లా? మీకేమైనా మతుండే మాట్లాడుతున్నారా? దానికి మంచి చేస్తామని తీసుకొచ్చాం. ఇదేనా? మా అక్కయ్య అసలు ఊరుకోదు. దానికొచ్చిన సంబంధం కాస్తా ఈవిడగారు ఎగరేసుకుపోయింది. కట్నం అక్కర్లేదన్నాడేమో అతడు? మళ్లీ సగం డబ్బు దేనికట?'' అసహనంగా అరిచింది సరళ.

''చూడు, కావ్యకేదో చేద్దామని తీసుకొచ్చానంటున్నావు, దాని చదువు గురించి ఎప్పుడేనా పట్టించుకున్నావా? బాగుపడేదైతే, చదువుకుని అదీ నీలిమ లాగా జాబ్ చేసేది. ఎవరో ఒకరు ముందుకొచ్చి చేసుకునేవారు. నీలిమకిలాగే మనకి తోచినది ఇచ్చి పంపేవాళ్లం. కానీ నువ్వేం చేశావు? చదువుకోవలసిన పిల్లని చెలికత్తెలాగా నీ వెంట తిప్పుకున్నావు'' అన్నాడు రాజశేఖరం.

వత్తిళ్లు తగ్గాక అతన్లో వివేచన పెరిగింది. ఇది వరకూ అతని ఆలోచనలన్నీ ఎక్కడి నుంచీ డబ్బు పుట్టిద్దామా అనే విషయం చుట్టే పరిభ్రమించేవి. కావ్య విషయంలో ఎక్కడ పొరపాటు జరిగిందో వివరించి చెప్పగలిగాడు. కానీ సరళే అర్థం చేసుకోలేకపోయింది.

''అంటే మీ కూతురు రాకుమారీ, నా కూతురు చెలికత్తేనా?'' మండిపడింది.

''పిన్నీ, బాబాయ్ చెప్పినదాంట్లో తప్పేముంది? ఎందుకు, అనవసరంగా గొడవ? ముందు నీలిమ పెళ్లవ్వనివ్వండి'' కావ్య సర్దిచెప్పింది.

''మీ అమ్మకి నేను మొహం ఎలా చూపించనే? మా ఇంట్లో ఎవరికీ జరగనంత గ్రాండ్గా నీ పెళ్లి జరిపిస్తానన్నాను. అందర్లో ఎలా తలెత్తుకు తిరగను?'' సరళ ఏడ్చింది.

రాజశేఖరం మెత్తబడ్డాడు. ''ఏడుపెందుకు? నీలిమ పెళ్లయిపోతే కొంచెం కూడదీసుకుని దీని పెళ్లి చెయ్యకూడదా? ఇంకా నాకు నాలుగేళ్ల సర్వీసుంది కదా? ఐనా పెళ్లెలా చేశానని కాదు, పెళ్లికొడుకెలాంటివాడనేది ముఖ్యం'' అన్నాడు ఓదార్పుగా.

★ ★ ★

సింపుల్గా రిజిష్టరు మేరేజి చేసుకుంటానన్నాడు సూర్య.

''అదేంటిరా? కట్నంకానుకల్లేవు. పెళ్లేనా గ్రాండ్గా చేయకపోతే ఎలా?'' అంది వైదేహి.

''అమ్మా! ప్రస్తుతం వాళ్లున్న పరిస్థితిలో డబ్బు ఖర్చు పెట్టలేరు. గ్రాండ్గా చేసుకోవాలనేది మన సరదా. మన సరదా కోసం వాళ్లని ఖర్చు పెట్టమనడం సరైనది కాదు. మనం రిసెప్షను ఎరేంజి చేద్దాం'' మెత్తగా అన్నాడు.

''నువ్వేది చెప్తే విన్నావుగనుక?'' నిరసనగా అంది. మనసులో నీలిమ పట్ల కొంచెం కోపం ఉండిపోయింది. కానీ పెళ్లి చేసుకుని వచ్చి బేలగా తన చేతులు పట్టుకుని ''మీ అందరి మనసూ కష్టపెట్టాను. అటు మా ఇంట్లో కూడా బాధపడే ఉంటారు. నన్ను క్షమించండి'' అంటుంటే మనసు కరిగిపోయింది. తల్లిని పోగొట్టుకుని తన వళ్లో పడి ఏడ్చిన ఆ పదిహేనేళ్ల అమ్మాయి గుర్తొచ్చింది.

అకారణంగా కొందరి జీవితాల్లో అపశృతులు దొర్లుతుంటాయి. వాటిని సరిచెయ్యగలిగే అవకాశం ఉన్నవాళ్లు ఆ పని చెయ్యకపోతే ఎలా? అని సూర్యాని కూడా క్షమించేసింది.

ఆ నెల జీతం తీసుకెళ్లి మూర్తికిచ్చింది నీలిమ. ''పెళ్లికి ముందు మా నాన్నగారికి ఇచ్చేదాన్నండీ!'' అంది. ఆయనకి చాలా సంతోషం కలిగింది. నీలిమ జీతం తనకిచ్చినందుకు కాదు, తన పెద్దరికానికి విలువనిచ్చినందుకు. నువ్వెంత నీ లెక్కెంత అన్నట్టు ఉంటే ఎంతటి వాళ్లకేనా బాధగా ఉంటుంది. ''నాకెందుకమ్మా? నువ్వూ సూర్యా కలిసి దాచుకోండి'' అన్నాడు ప్రేమగా.

తర్వాత భార్యకి చెప్పాడు గర్వంగా ''సూర్యా ఫ్రెండు...'' అంటుంటే వైదేహి ఆపి-

''ఫ్రెండెవరండీ?'' అనడిగింది.

''వాళ్లిద్దరూ ఫ్రెండ్సు కాదూ?'' అని నవ్వి, విషయం చెప్పాడు.

''మంచి పిల్లే'' సంతృప్తిగా అందామె. అని, ''వాళ్లిద్దరూ ఇప్పుడు ప్రగాఢమైన ప్రేమికులు. ఫ్రెండ్షిప్ తర్వాతి ప్రకరణంలోకి అడుగుపెట్టారు'' అంది.

★ ★ ★

''బావా!''

''చెప్పు కావ్యా!''

''నువ్వు నీలిమని ప్రేమించావా? ఈ ఒక్క ప్రశ్నకి జవాబు చెప్పు''

సూర్య నవ్వాడు. ''అలా ప్రేమించి ఉంటే తనొక్కదాన్ని గురించే ఆలోచించేవాడిని. తన సమస్యల గురించి ఆలోచించేవాడిని కాదు. అన్నిటికీ మించి నీతో పెళ్లిచూపులకి వచ్చేవాడిని కాను. మా మధ్య ఉన్నది స్నేహమే'' అన్నాడు.